
# కంటకాభరణం

## 50



**ఇల్లెగిరి** పోయేటట్టు గుంట గుక్కపట్టింది.

'కాస్త దాన్ని ఊరుకోబెట్టవే చెల్లీ' అంటూ రామూ విసుక్కున్నాడు. పాపా వాళ్లమ్మ వచ్చేదాకా దాన్నెలాగో సముదాయించి మరీ ఇవతలి కొచ్చింది రేవతి.

అయినా దాని ఏడుపు అడపాదడపా వినిపిస్తూనే ఉంది. ఇది చాలక ఎప్పట్నుంచో పట్టుకున్న హన చప్పుడు ఒకటీ.

"ఇంత వర్షంలో ఆవిడగారు వస్తుందో, రాదో" అన్నాడు రామూ.

"ఎవర్రా ఆవిడ?" అనడిగింది రేవతి.

"నిన్నటి సాహితీ సభలో కనపబడిందన్నానే ధైవలీలగారని, ఆవిడా!"

"సభల్లో ప్రజల్ని చంపడంతో తృప్తి కలగలేదు కాబోలు, ఇంట్లో కూడా సాహితీ గోష్ఠులు

కాబోలు. కర్మ! ఇంతకంటె చంటిదాని ఏడుపే ఏ ఇంటికైనా సహజాలంకార మేమో!" రేవతి నవ్వుతూ అంది.

"అమ్మో, ఏమో అనుకున్నా.... నీ నోటకూడా చక్కని పలుకు బళ్ళు దొర్లుతున్నాయే!"

"ఏదో సావాసదోషంగాని, మీ రెక్కడ నే నెక్కడ!"

"నువ్వెక్కడో నాకు తెలీదు గాని చెల్లీ, అదిగో అక్కడ మెట్లమీద నిలబడి గొడుగు ముడుచుకుంటోంది - ఆవిడే ఇవాళ నా అతిథి. రండి దైవలీలగారూ! వానలో ఇబ్బందేం పల్లేదుకదా!

'నమస్కారం రామారావుగారూ! ఇబ్బంది పడినా మీలాంటివారు ఆహ్వానించాక తప్పుతుందా?' అంటూ దైవలీల లోపలికొచ్చి కూర్చుంది.

"ఈ అమ్మాయి మా చెల్లెలు రేవతి. ప్రయివేటుగా తెలుగు బియ్యేకి కట్టింది"

"అలాగా.... సంతోషం.... ఇప్పుడెందుకండీ ఇవన్నీ?" అంటూనే కాఫీ టిఫినూ కానిచ్చింది దైవలీల.

నిశ్శబ్దాన్ని చీలుస్తూ రేవతి అంది. "మిమ్మల్ని కలుసుకోవడం మా అదృష్టం. మీ గురించి అన్నయ్య ఎంతో చెప్పాడు"

'చెప్పడానికేముందండీ! ఆయన అభిమానంగాని! ముప్పై నిండకుండానే ఇటు గోల్డు మెడలూ, అటు డాక్టరేటూ సంపాదించాననుకోండి! అయినా అవన్నీ పైకి చెప్పుకుంటామా!"

"ఇంతకీ మీ థిసిస్ దేనిమీద?" అనడిగాడు రామూ ఆమె వినయానికి విస్మయపడుతూ.

"పరిశోధన దేనిమీ దంటారా? 'పానుగంటివారి కంఠాభరణంలోని తెనుగు నుడికారం' అనే సబ్జెక్టుమీద. గతంలోకి వెళ్లి ఆ ప్రాంతపు పలుకుబళ్ళు పైకి లాగేసరికి ప్రాణం పోయిందనుకోండి. ఎవరూ సాధించి ఎరగనిదాన్నే శోధించాలనేది నా ఆశయం. ఏం చెయ్యను! గొప్ప గొప్ప సాహితీవేత్తలే నా కృషి గమనించి 'ఇది అరుదైన సాహితీ విశ్లేషణ కాని మరొకటి కాదు' అని దీవించారు. ఈ జన్మకింకేం కావాలి! ఎక్కడో పాప ఏడుపు వినిపిస్తున్నట్టుంది"..... అంటూ ఆగింది దైవలీల.

"మా పెద్దక్కకి నాలుగేళ్ల బాబు తర్వాత ఈ పాప'

"అలాగా! పేరేం పెట్టేరు?"

"మావాడు చెల్లెల్ని అయిదు నిమిషాలపాటు ఏడిపించకుండా ఉండలేడు. దాన్తో మా పెద్దక్క వాణ్ణొకటి వేస్తుంది. వాడు బేరుమంటే, చెల్లి క్యారుమంటూ శ్రుతి కలుపుతుంది. పెద్దలు పెట్టిన పేర్లకేంగాని వీళ్ల నిత్య హోరు భరించలేక మేం సరదాగా 'లబో', 'దిబో' అనే పేర్లు పెట్టుకున్నాం."

దైవలీల నవ్వుతూ అంది- "బలే తమాషా పేర్లు పెట్టారే! సాహితీ ప్రియులు అనిపించుకున్నారు! ఇంతకీ ఏడవడం వాళ్ల జన్మహక్కు 'బాలానాం రోదనం బలం' అని ఊరికే అన్నారా పెద్దలు?"

"అంటే ఏమిటి మేడమ్? కాస్త వివరించరూ?" అనడిగింది రేవతి.

ఎదురుచూడని ఆ ప్రశ్నకి కలిగిన తడబాటు కప్పి పుచ్చుకుంటూ దైవలీల ఇలా అంది: "ఏదో అడిగారుగాని, మీకు మాత్రం తెలియదనా? ఏ సామెత అయిన ఊరికే పుట్టదుగా!' 'బాలానం రోదనం బలం' అంటే పసిపిల్లలు అన్నీ ఏడ్చి సాధిస్తారనే అర్థమయి ఉంటుంది."

రేవతి "మరికాస్త విడమర్చి చెప్పరూ?" అనడిగింది.

దైవలీల ఇలా వివరించింది. "ఇప్పుడు గుక్కపట్టి ఏడుస్తున్న మీ నెలల పాపనే తీసుకుందాం.

దేనికేదైనా అవసరం వస్తే నడిచి వెళ్ళి తీసుకునే శక్తి లేదుకదా! అలాంటివాళ్లకి దేవుడిచ్చిన సాధనం రోదనం. గట్టిగా ఏడిస్తే అమ్మో నాన్నో వచ్చి ఆదుకోకపోతారా అనేది అందులో అంతరార్థం!

"నేనింకోలా చదివాను సుమండీ" అన్నాడు రాముూ చటుక్కున.

"అనేక అర్థాలు ఉండొచ్చు. నే చెప్పిందే అసలైన అన్వయం" అంది దైవలీల నిశ్చయంగా, దృఢంగా.

అయినా రాముూ తన వివరణ ఆపలేదు. "పోనీ ఇది కూడా వినండి. పసిపిల్లలు ఏడుస్తున్నప్పుడు కాళ్లూ, చేతులూ ఆడిస్తారు. ఒళ్లంతా కదిలిస్తారు. ఊపిరి బాగా పీల్చి వదులుతారు. అంటే శరీరంలో ప్రతి కండరానికీ వ్యాయామం జరుగుతుంది. అలా బాగా ఏడిస్తేనే తాగిన పాలు వాళ్లకి సరిగ్గా జీర్ణం అవుతాయి. ఆ వయసులో వాళ్ల కదే ప్రకృతి సూచించిన వ్యాయామం, బలం. ఈ మధ్యనే ఆ వివరణ చదివి అండర్‌లైన్ చేసి ఉంటాను. ఆ పుస్తకం తెచ్చి చూపించనా?"

దైవలీల కళ్ళు చిట్లించింది. 'పుస్తకాలకేం లెండి, అభిప్రాయ భేదాల పుట్టలు" అని కొట్టిపారేసి, "ఇంతకీ మీరేం చేస్తుంటారు?" అనే ప్రశ్నతో మాట మార్చింది.

"యూనివర్శిటీలో ఆనర్సు పిల్లలకి తెలుగు చెబుతుంటాను. మీరు.....?"

"ఇదిగో ఈ డాక్టరేట్ వచ్చాక ఎక్కళ్లేని ఆఫర్సూ వచ్చిపడుతున్నాయి. ఎందర్ని తృప్తి పరచగలం చెప్పండి.....? సరే నే వస్తా. వర్షం తగ్గినట్టు లేదే! వస్తే ఒక్కసారి ఇలాగే వచ్చేస్తాయి. ఊరూ వాడా నదులు పొంగి, జలకాలుష్యం జరిగి, ఎక్కళ్లేని రోగాలూ పట్టుకుంటాయి. అందులో మీ విశాఖపట్నంలో మరీనూ. 'విశాఖలో వర్షాలు, వ్యాధులకు హర్షాలు' అనే సామెత మీకు తెలిసే ఉంటుంది."

"కేవలం విశాఖపట్నంమీదే ఓ సామెత ఉండడం చిత్రంగా ఉందే!" అంది రేవతి.

"అది విశాఖపట్నంమీద కాకపోవడమే అసలైన చిత్రం!" అనే రాముూ జవాబుకి ఉలిక్కిపడి "అదేమిటండీ, అంత స్పష్టంగా 'విశాఖలో వర్షాలు' అని ఉంటే?" అని దబాయించబోయింది దైవలీల.

రాముూ ఈ సారి మాత్రం లొంగలేదు.

"అది ఓ వ్యవసాయ సామెత. అందులో 'విశాఖ' అనే మాటకు విశాఖపట్నం అని అర్థం కాదు. 'విశాఖ కార్తె' అని. ఆ కార్తెలో పడితే అది అకాల వర్షం అవుతుంది. అ కాలంలో పడిన వర్షం విశాఖపట్నంలో అయినా నిజాంపట్నంలో అయినా రోగాలకు కారణం అవుతుందని అర్థం."

"ఏమిటో... అన్నీ తెలిసినవారని ఆహ్వానిస్తే ఆశపడి వచ్చాను. ఇంతగా సాహితీ సీమలో ఎదిగిన నన్నే ప్రతీ దానికీ కొట్టిపారేస్తున్నారు. నే వెడతాను. వెళ్లేముందు ఒక్కమాట. జనాభా పెరిగి ఇప్పుడిలా తగలడిందిగాని మీ విశాఖపట్నం ఒకప్పుడు ఎంత బాగుండేది! పానుగంటివారు తన కంఠాభరణంలో 'విశాఖపట్నం భోగాలు' అనే పదం ఎన్నిసార్లు వాడారని! అది మరచిపోకండి.... శలవు" అంటూ విసవిసా నడిచి వెళ్ళిపోయింది.

ఆవిడ వెళ్ళే వరకూ ఎలాగో ఆపుకున్నాడుగాని ఆ తర్వాత విరగబడి నవ్వాడు రాముూ.

"ఎందుకురా బాబూ అంత నవ్వు?" అని రేవతి అడిగితే అతని వివరణ ఇదీ....

"ఏం చెప్పను? 'కంఠాభరణం' అంతా ఇంచుమించు నాకు కంఠోపాఠం. పానుగంటివారు 'విశాఖపట్నంభోగాలు' అనే మాట వాడినమాట నిజమేగాని, దైవలీల చెప్పినట్టు మాత్రం కాదు.

ఆయన కాలంలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలన్నీ కలిసి 'మెద్రాస్ ప్రెసిడెన్సీ' గా ఉండేది. ఆ రోజుల్లో ఆ ప్రాంతాల్లో బోదకాలు అంటారు చూశావా, ఏదీ 'ఫైలేరియా' అనే రోగం, బాగా వ్యాప్తిలో ఉండేది. వ్యంగ్య హాస్య ధోరణిలో పానుగంటివారు ఉదహరించింది ఆ రోగం గురించే. నా బాధ అందుకు కాదు, డాక్టర్ దైవలీల పాఠాలు వినే తెలుగు పిల్లలు ఏమైపోతారో అని!"

*(ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక, 17-4-96)*

✿